వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 179 మంగళవారం | 16 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు



8లో..

**అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌లకు ఛాన్స్**

**నామినేషన్లకు సిద్ధం కావాలన్న అధిష్టానం**

# గొర్రెల పథకంలో.. గోల్‌మాల్





## ఫైళ్ల మాయంపై.. ప్రభుత్వం సీరియస్

- అక్రమాలను కప్పి పుచ్చేందుకే దుశ్చర్యలు
- ఏసీబీకి అప్పగిస్తూ నిర్ణయం
- ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీ
- ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్న సీఎం రేవంత్
- రోగం తెలిస్తే..మందు వేయడం సులభం అన్న పద్ధతిలో ముందుకు

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన అంతా అస్తవ్యస్తంగా ఉందన్న విషయం మెల్లగా ప్రజలకు అర్థమవుతోంది. గోబెల్స్ ప్రచారాలతో ఊదరగొట్టిన కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఇప్పుడు గట్టిగా సమాధానం చెప్పలేక పోతున్నారు. అప్పుల గురించి అడిగితే ఎదురుదాడి చేస్తున్నారు. అస్తవ్యస్త పాలన గురించి నిగ్గదీస్తే కాంగ్రెస్ హామీలంటూ గగ్గోలు పెడుతున్నారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి ఒక్కొక్కటి చక్కదిద్దే పనిలో పడ్డారు. రోగం తెలిస్తే..మందు వేయడం సులభం అన్న పద్ధతిలో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీ వేసిన ప్రభుత్వం నాంపల్లిలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ మాయం కావడంతో సంబంధం ఉన్న పలువురు అధికారులపై కేసులు నమోదు చేయడంతోపాటు తాజాగా కేసును ఏసీబీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో అప్పటి పాలకులు, అక్రమాలకు ఊతమిచ్చిన అధికారులకు ముచ్చెమటలు మొదలయ్యాయి. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



## భద్రకాళిని దర్శించుకున్న హీరో శ్రీకాంత్

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం ప్రముఖ హీరో శ్రీకాంత్ కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
పూజానంతరం శ్రీకాంత ఊహ దంపతులకు అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించారు. ఈ కార్యక్రమంలో వరద రాజేశ్వర్ రావు, దేవాలయ మాజీ ధర్మకర్త శ్రీ తోనుపునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.
-వరంగల్ వాయిస్, వరంగల్



2లో..

## దివ్యాంగులను ప్రత్యేకంగా గుర్తించాలి

**దేవాలయాల్లో వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలి**

**మంత్రి సురేఖకు దివ్యాంగుల వినతి**

## భక్తులతో పోటెత్తిన కొత్తకొండ

**వీరభద్రుడి సేవలో రాజకీయ ప్రముఖులు**

**గుమ్మడికాయలు, కోరమీసాలు సమర్పించిన భక్తులు**



8లో

# గొర్రెల పథకంలో..
# గోల్ మాల్



## ఫైళ్ల మాయంపై.. ప్రభుత్వం సీరియస్

**అక్రమాలను కప్పి పుచ్చేందుకే దుశ్చర్య లు**

**ఏసీబీకి అప్పగిస్తూ నిర్ణయం**

**ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీ**

**ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్న సీఎం రేవంత్**

**రోగం తెలిస్తే.. మందు వేయడం సులభం అన్న పద్ధతిలో ముందుకు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రోగం ఏమిటో తెలిస్తే...మందు వేయడం సులభం. అందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మెల్లగా సమస్యలను గుర్తించి..పరిష్కరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ధరణిలో భూ సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు వేసింది. ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పేరుతో భూముల రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలను కూడా ప్రభుత్వం వెలికితీయాలని నిర్ణయించింది. అయితే ఇందులో పట్టా భూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అలాగే బక్క రైతుల భూములను బలవంతంగా లాక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను కూడా కమిటీ గుర్తించనుంది. ధరణిలో ఎక్కినంత మాత్రాన తమకు ధోకా లేదన్న భావన లేకుండా చేయాలి. ఇందు కోసం కొత్తగా ఏర్పడిన కమిటీ గ్రామాల వారీగా వివరాలు నమోదు చేసేందుకు సిద్ధపడుతోంది. అన్యాయం జరిగిందన్న వారు దరఖాస్తు చేసుకునే విధంగా వెసులుబాటు కల్పించనున్నారు.

### ధరణి బయట 18వేల మంది..

అధికారంలోకి వస్తే..ధరణిని బంగాళాఖాతం వేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు పదేపదే ప్రకటించారు. ధరణి పోర్టల్లలో భూముల ఖాతాలు ఉన్న వారికే పట్టా పాసు పుస్తకాలు జారీ చేయడంతో ఎంతో మంది రైతులు ఇబ్బందులకు గురయ్యారు. ధరణి వెలుపల 18 లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్‌తో లక్షల్లో పెండింగ్ సమస్యలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి పోర్టల్‌ను పునర్నిర్మించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. కొత్త సమస్యలు తలెత్తకుండా... ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుకొవడంలో ఈ కమిటీ సమగ్రంగా పనిచేయనుంది. ఈ క్రమంలో ముందుగా ధరణిలో సమస్యలను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో పేరుకు పోయిన భూ సమస్యలకు కారణమైన పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేస్తే తప్ప పరిష్కారం సాధ్యంకాదని, రెవెన్యూ అధికారులు కూడా ప్రభుత్వానికి ఇప్పటికే సూచించారు. పోర్టల్‌లో సాంకేతికంగా అనేక సమస్యలు ఉన్నాయని నివేదించారు. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలను తొలగించి సరికొత్తగా రూపొందించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది.

### తలసాని మెడకు ఉచ్చు..



రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు కాగానే పలుచోట్ల ఫైల్స్ మాయం, దగ్ధం కావడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. నాంపల్లిలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో కీలకమైన ఫైల్స్ మాయం కావడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అంతేకాకుండా గొర్రెల పంపిణీలో జరిగిన అక్రమాలపై ఫోకస్ పెట్టింది. దీంతో గొర్రెల స్కీమ్ గోల్ మాల్ పై అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మెడకు అవినీతి ఉచ్చు బిగుసుకోనుంది. తలసాని ఓఎస్డీ కల్యాణ్ మాసబ్ ట్యాంక్ లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అక్రమంగా ప్రవేశించి, సిబ్బంది సహాయంతో బీరువాలో ఉన్న ఫైళ్లను చింపివేసి, కొన్ని ముఖ్యమైన ఫైళ్లను తన కారులో తీసుకెళ్లాడు. ఈమేరకు వాచ్‌మెన్ మందాల లక్ష్మయ్య ఫిర్యాదుతో పోలీసులు కల్యాణ్, ఆపరేటర్ మోహన్ ఎలిజ, వెంకటేశ్, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశారు. ఇక గొర్రెల పంపిణీ వ్యవహారంలో కూడా కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ పథకంలో బీఆర్ఎస్ పెద్ద ఎత్తున నిధులను మళ్లించినట్లుగా గుర్తించింది. దీంతో పలువురు అధికారులపై కేసులు నమోదు కాగా తాజాగా ఈ రెండు కేసులను ఏసీబీకి బదిలీ చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

### త్వరలో భూమాత పోర్టల్..



ధరణి

ఇప్పటికే ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూళ్లను అమల్లోకి తీసుకొచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. అందుకే భూమాత పోర్టల్ తీసుకురావడానికి ముందే.. ఉన్న సమస్యలను పరిష్కరించి.. అవి మళ్లీ తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పట్టా భూములతో పాటు అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీ జిల్లాల్లో పర్యటించి.. భూ సమస్యలపై అధ్యయనం చేయనున్నారు. కమిటీకి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం సూచించింది. భూ సమస్యల మూలాలను కనుగొని.. వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

### సమగ్ర సమాచారం ఉంటే..


చిత్తశుద్ధితో సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించే దిశగా రేవంత్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఇందుకు కావాల్సిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు. సమాచారం ఉంటే.. అధ్యయనం చేయడం సులువు అవుతుందని భావిస్తున్నారు. కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది కనుక సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగాలి. ధరణిపై వేసిన కమిటీలో కన్వీనర్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రైతుల సమస్యలపై పట్టున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండ రెడ్డి, మాజీ ఐఏఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రేమండ్ పీటర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించింది. భూ చట్టాల నిపుణుడు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యుడు సునీల్, రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈ కమిటీ... ధరణి పోర్టల్‌లోని సమస్యలను గుర్తించి.. వారికి పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ నివేదిక ఇవ్వాలని.. కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కమిటీ పనిచేయనుందని పేర్కొన్న దరిమిలా సమస్యలపై ఫిర్యాదులను కూడా స్వీకరించాలి. ఏ భూములు ఎలా అక్రమాలకు గురయ్యాయో సమాచారం కూడా తెప్పించుకోవాలి. అలాగే గత బీఆర్ఎస్ పెద్దలు అక్రమంగా ఆక్రమించుకున్న భూములపైనా విచారణ జరగాలి. చెరువుల శిఖాలను ఆక్రమించుకుని బహుళ అంతస్తులు కట్టుకున్న వారి చిట్టాలను కూడా తీయాలి. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరంలో చెరువులు మాయం అయ్యాయి. చెరువు శిఖాలను మాయం చేశారు. ఇవన్నీ కూడా బయటపడాలి. అప్పుడే ధరణి సంస్కరణలకు అర్థం ఉంటుంది. గ్రామాల్లో మాన్యాలను మింగేసిన ఘనుల భరతం పట్టాలి. గుళ్ల పేరుతో ఉన్న ఆస్తులను కొందరు అక్రమార్కులు కబ్జా చేసుకున్నారు. ధరణిలో తమపేరును ఎక్కించుకున్నారు. ఇలా వేల ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ ఇప్పుడు వేలకోట్లల్లో ఉంటుందని అంచనా. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కౌలు చెల్లించే విధంగా వేలం కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి భూములను కూడా గుర్తించి స్వాధీనం చేసుకుని కబ్జాదారులకు విముక్తి కలిగించాల్సి ఉంది.

## దివ్యాంగులను ప్రత్యేకంగా గుర్తించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అన్ని సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజీమ్, గౌరవ అధ్యక్షుడు అంబటి రాజేందర్ కోరారు. మంగళవారం హనుమకొండలోని గెస్ట్ హౌజ్ లో రాష్ట్ర అటవీ, దేవదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ-మురళిధర్ రావు చేతుల మీదుగా రాష్ట్ర, జిల్లా దివ్యాంగ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్ లను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణలోని అన్ని దేవాలయాల్లో దివ్యాంగులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని, వారు గుడిలోకి ప్రవేశించేలా వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. దేవాలయాల్లో నిర్వహించే వివిధ టెండర్లలో దివ్యాంగులకు మెదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అటవీ శాఖ, దేవాదాయ శాఖలోని బ్యాక్ లాగ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి గై సతీష్, కోశాధికారి బత్తిని రాజు, ఉపాధ్యక్షులు పాకాల మనోహర్, బిల్ల రమేశ్, ఉరుగొండ అశోక్, సిరిపురపు రాజేశ్వర్, మహిళ కార్యదర్శులు అడ్డూరి వాణి, సంగి సునీత, సహాయ కార్యదర్శులు రచ్చ శ్రీధర్, అబ్దుల్ షబ్బీర్, నీలం రాజు, సభ్యులు పుప్పల రమేశ్, చెన్నూరి మహేశ్, కొరండ్ల సంపత్, దికొండ సాయిరాం, మండల అశోక్, కలకొట్ల వంశి, జ్యోతి, లక్క లక్ష్మి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మునిగాల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అజ్మీర వెంకటేష్, జిల్లా కోశాధికారి మడికొండ రవి, ముఖ్య సలహాదారులు చెదలవాడ లక్ష్మినారాయణ, ఎండి.ఖాజా పాషా, మహిళ కార్యదర్శులు రావుల రజినీ, కీర్తి చంద్రకళ, ఉపాధ్యక్షులు ఆకులపెల్లి రమేశ్, మందపురి అశోక్, సహాయ కార్యదర్శులు వేల్పుల ప్రభాకర్, పెండ్యాల నాగరాజు, ప్రచార కార్యదర్శులు బత్తిని గోపి, ఎండి.అఫ్జల్, కార్యవర్గ సభ్యులు నన్నబోయిన రవి, యాటాకాల కోటేశ్వర్, వడ్డెపెల్లి రాజు, వెలిగేటి సురేందర్, బొమ్మతి రాహుల్, బిర్రు హైమవతి, పెండ్యాల సాగర్, బధవత్ బాలాజి, మైనార్టీ నాయకులు ఇఫ్ఫాజ్, దహీర్ తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా తగిలి గాయాలు

**పోచమ్మ మైదాన్‌లో ఘటన**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చైనా మాంజా తగిలి వాహనంపై వెళుతున్న ఒకరి గొంతుకు తీవ్ర గాయం కాగా పలువురికి గాయాలైన సంఘటన నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్ లో సోమవారం జరిగింది. చైనా మాంజా ప్రమాదకరమని, దీనిని వాడకూడదంటూ పోలీసులు హెచ్చరించినా, ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించినా అడ్డు అదుపూ లేకుండా విక్రయాలు సాగుతున్నాయి..విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్ లోని సూర్య బార్ సమీపంలో బైక్ పై వెలుతున్న వెనుక వ్యక్తి మెడకు చుట్టుకుని తీవ్ర గాయం అయింది. దీంతో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో పక్కనే ప్రయాణిస్తున్న ఇద్దరు అమ్మాయిలు కింద పడడంతో చేతులకు గాయాలయ్యాయి. తీవ్ర గాయమైన వ్యక్తిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా ఎనిమిది కుట్లు వేశారు. దీంతో ప్రాణాపాయ స్థితినుంచి బయట పడినట్లు అయింది. చైనా మాంజా వాడొద్దని పోలీసులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

## ఎమ్మెల్యే రేవూరికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మంగళవారం మకర సంక్రాంతి కనుమ పండుగ పర్వదినాన పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డిని కలసి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా శాలువతో సత్కరించారు. మకర సంక్రాంతి పండగ పరకాల ప్రజలలో కొత్త వెలుగులు తీసుకురావాలని కోరుతూ ఆత్మకూర్ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, ఆత్మకూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ఆత్మకూరు మండల్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్ రెడ్డి, జిల్లా నాయకులు రేవూరి జలంధర్ రెడ్డి, ఆత్మకూరు గ్రామ ప్రధాన కార్యదర్శి అలువాల రవి, సొసైటీ డైరెక్టర్ ఉడుత రాజేందర్ పాల్గొన్నారు.

## ఎస్ఐ రవికుమార్‌ను కలిసిన జర్నలిస్టులు




**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని సీనియర్ జర్నలిస్ట్ నామాల రమేష్, బండి సమ్మయ్య ఆధ్వర్యంలో ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సంబంధించిన జర్నలిస్టులు సోమవారం రేగొండ పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రవి కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి పూలే బోకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ, ప్రజా రక్షణతో పాటు వారి సమస్యలు పరిష్కరిస్తూ శాంతిభద్రతలు పరిరక్షించడం పోలీసుల ప్రథమ కర్తవ్యమని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు జరిగే న్యాయం ద్వారానే పోలీసులకు గుర్తింపు ఉంటుందని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ తోపాటు ప్రజల మన్ననలు మరింత పొంది భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ లు మాట్లాడుతూ, ప్రజలు ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితులకు నిష్పక్షపాతంగా న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బత్తుల వెంకటేశ్వర్లు, మంతెన మధుకర్, ఆనంద్ పాల్గొన్నారు.

## మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణ మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కమిటీని మంగళవారం కంటయపాలెం రోడ్డులోని పాటిమీద దేవాలయ ప్రాంగణంలో అధ్యక్ష కార్యదర్శులను, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను డివిజన్ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్ము దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా మూల శేఖర్, కోశాధికారిగా సలుగు నరసయ్యను ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యులుగా ఆకుల పుల్లయ్య, మార్గం సంపత్, పుప్పాల సంపత్, జలకం శివ, మారిపెల్లి గోపి, సుకన్య, ఎం.భాస్కర్, జలకం నవీన్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. తమ మీద నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం బలోపేతం విధివిధానాలు త్వరలోనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సభ్యులు శివకుమార్, సునీల్, శేషగిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుకు చేరాల్సిన ధాన్యం పక్కదారి

### డీసీఎం, ఆటోలను పట్టుకున్న రైతులు
### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, ములుగు :** వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో ఆరుగాలం శ్రమించిన రైతన్నలకు పంటను విక్రయించి డబ్బులు తీసుకునే వరకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు, కాంటాలలో మోసం, తేమ పేరుతో దగా... ఇలా అడుగడుగునా ఎదురయ్యే సమస్యలను అధిగమించడం అన్నదాతకు తలకు మించిన భారంగా మారుతోంది. సోమవారం రాత్రి నల్లగుంట గ్రామంలో ఐకేపీ సెంటర్ నుంచి మిల్లుకు చేరాల్సిన ధాన్యం బస్తాలను మధ్యలో వాహనం నుంచి ఆటోలోకి మార్చి తరలిస్తుండగా రైతులు పట్టుకున్న తీరును చూస్తే మరో కొత్త మోసానికి తెరతీసినట్లు కనిపిస్తోంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగుంట గ్రామానికి చెందిన పేర్ల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ధాన్యం నల్ల గుంట ఐకేపీ సెంటర్ నుంచి డీసీఎం ద్వారా వెలుతుర్లపల్లిలోని రైస్ మిల్ కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నల్లగుంట –పాలంపేట గ్రామాల మధ్య డీసీఎం వ్యాన్ డ్రైవర్, ఆటో వ్యక్తితో కలిసి ధాన్యాన్ని కాజేస్తున్నట్లు అనుమానం వచ్చిన కొందరు రైతులు నాలుగోసారి డీసీఎం వెళ్తుండగా కిలోమీటర్ కు ఒక రైతును కాపలా పెట్టి డీసీఎం నుంచి ఆటోలోకి ఎనిమిది బస్తాలను ఎక్కించిన తర్వాత రైతులంతా ఒక్కసారిగా అక్కడికి వెళ్లారు. దీంతో డీసీఎం డ్రైవర్ పారిపోగా ఆటో డ్రైవర్ ను పట్టుకున్నారు. దీనిపై వెంకటాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. ధాన్యం బస్తాలను దొంగిలించడంలో ఎవరెవరి పాత్ర ఉందో పోలీసు విచారణలో తెలియనుంది. కాగా ఇప్పటికే కాంప్రమైజ్ కోసం మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. ఏదిఏమైనా రైతుల శ్రమ దోపిడీ కి పాల్పడే ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని తోటి రైతుల కోరుతున్నారు.

## 21న శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పూజ్య గురు దేవుల దివ్య సన్నిధానం సప్త దామంలో 21న ఉదయము 9.30 గంటలకు దాదాపు 500 జంటలతో సమిష్టి శ్రీ సీతారామ కళ్యాణం, పట్టాభిషేకం నిర్వహించ తలపెట్టామని, సుమారు 500జంటలకు సమిష్టిగా పూజలో పాల్గొనడానికి ఏర్పాట్లు చేస్తున్నామని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ , మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. మంగళవారం సప్తదామంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశములో మాట్లాడుతూ పూజ లో పాల్గొనుటకు ఎలాంటి రుసుం చెలించనక్కరలేదన్నారు. పూజలో పాల్గొను భక్తులు విధిగా పసుపు(సంప్రదాయ ) దుస్తులు ధరించి రావలెనని తెలిపారు. పట్టాభిషేక వెండి సాముద్రికను (అన్ని పూజ ద్రవ్యాలతోపాటు ఉచితంగా )ఇవ్వబడతాయని, ఈ కార్యమానికి అందరూ (కుల, మతాలతో పని లేకుండా ) ఆహ్వానితులే అని అన్నారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ ప్రతి భక్తుడికి శ్రీ సీతారాముల వారి కల్యాణ అక్షింతలు ప్రసాదం ఇవ్వబడతాయని, పూజ అనంతరం అందరికి సాంప్రదాయ వంటకాలతో భోజనం వడ్డిస్తారన్నారు . భక్తులు వారి వారి కాలనీలోని దేవాలయ కమిటీ, వేద పండితుల ఫోను నెంబర్ ను, ఫోను నెంబర్ 9848423133 లేదా 9849821999లకు వాట్సాప్ ద్వారా తెలిపితే పాసులు అక్కడ అందుబాటులో ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ మాదారపు సదాశివుడు , సభ్యులు గందె ఉమాశంకర్, రేపాల రామ్ చందర్ పాల్గొన్నారు.

## ఎంపీ సీటు ఉల్లంగుల యాదగిరికి ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరీంనగర్, ఖమ్మం పార్లమెంటు స్థానాలల్లో ఏదోక పార్లమెంటు స్థానం నుంచి పార్లమెంట్ సీటు ఉల్లంగుల యాదగిరికి ఇవ్వాలని వెనుకబడిన కుల సంఘాల ప్రతినిధులు కోరారు. అత్యంత వెనుకబడిన ఓట్లు 2,55,000 ఉన్నందున మోస్ట్ బ్యాక్ వార్డ్ కులాల ప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, ఖమ్మం పార్లమెంటు సీటు ఉల్లంగుల యాదగిరికి ఇచ్చి అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా మేదరి అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్, మోస్ట్ బ్యాక్ వర్డ్ కులాల ప్రతినిధులు మాట్లాడుతూ 2024లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కరీంనగర్ గానీ, ఖమ్మం గానీచ, లేదా రాజ్యసభ, ఎమ్మెల్సీగా గానీ అవకాశం కల్పించాలన్నారు. ఏఐసీసీ నేషనల్ జాయింట్ కోఆర్డినేటర్ గా, ఇంచార్జి మధ్యప్రదేశ్ ఓబీసీగా, అఖిల భారతీయ ధోబి మహా సమాజ ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు.అత్యంత వెనుకబడిన కులం వారికి స్వాతంత్రం వచ్చిన నాటి నుంచినేటి వరకు ఏ రాజకీయ పార్టీ రాజ్యసభ సీటు ఇవ్వ లేదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీలో సీడబ్ల్యూసీ మెంబరు గాని, జనరల్ సెక్రెటరీ గాను ఇంతవరకు ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. ఈ సమావేశం లో దొడ్డిపాటి శేఖర్, ఏషబోయిన సాంబయ్య యాదవ్, కమటం ప్రభాకర్ రావు, పల్లపు యాదగిరి ఒడ్డెర, ఏకు సుధాకర్ మాదిగ, లింగారెడ్డి, అంకం కోమల, మామిండ్ల నారాయణ, పుల్లా రమేష్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు ప్రభుత్వ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరీ డాక్టర్ల కోరత ఉందని, సంబందిత శాఖాధికారులతో చర్చించి డాక్టర్ల నియమాకానికి చర్యలు తీసుంటామన్నారు. ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు నిర్వీరామంగా త్రాగు నీరు అందించాలని అదేశించారు. చిల్కోడ గ్రామ సమీప చెరువులో ఏర్పాటు చేసిన తూము డోర్లు సక్రమంగా పని చేయటం లేదని సర్పంచ్ రాయల వెంకట బాబు సమావేశ దృష్టి తీసుకోచ్చారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొవాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకముందు ఎస్సీ, ఎస్టీ టీచర్స్ నూతన క్యాలెండర్ ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, ఎంపీడీఓ చలపతి, ఎమ్మార్వో నాగభవానీ విద్యాసాగర్, బాబు, ఉప్పలయ్య, వీరన్న, సుధాకర్, మధు, వెంకట్రావ్ తదితరులు పాల్గోన్నారు.

# 18న మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈ నెల 18న ల్యాదెల్లలో డాక్టర్ దివాకర్ జంధ్యం, యూఎస్ఐ, ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ల్యాదెల్లలోని రెడ్ క్రాస్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. డాక్టర్ దివాకర్ జంధ్యం, యూఎస్ఏ, ఎన్ఆర్ఐ వీఏ అధ్యక్షుడు పందిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ నిర్వహించ బడుతుందని అన్నారు. ములుగు రోడ్డులోని ఒమేగా బన్ను క్యాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత క్యాంప్ జరుపబడుతుందని, ఇందులో ప్రధానంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్, సెర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, మమ్మోగ్రాం, ఎక్స్ రే, ఆంకాలజిస్ట్, రక్త మూత్ర పరీక్ష లు చేయనున్నారని తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రెడ్ క్రాస్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఈ క్యాంప్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ దివాకర్ జంధ్యం వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తామని, ఫిబ్రవరి, మార్చి 2024లో గ్రామంలోని కృత్రిమ అవయవాల కోసం స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జడ్పీహెచ్ పాఠశాల, జడ్పీ ప్రైమరీ స్కూల్ లలో హైస్కూల్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందజేశారు. వివిధ సౌకర్యాలతో వారు కొత్త తరగతి గదిని ఏర్పాటు చేస్తున్నారు. (డా.దివాకర్ జంధ్యం ఒక తరగతి గదికి ఆరు పాఠశాల బెంచీలను విరాళంగా ఇచ్చారు). ఎన్ఆర్ఐ వీఏ, యూఎస్ఏ పుస్తకాలను విరాళంగా అందిస్తోంది. (పుస్తక మిత ప్రోగ్రామ్) సాఫ్ట్ లాంచ్ వారు విద్యార్థులకు కిట్‌లను (నీరు, సీసాలు, పండ్లు అండ్ బిస్కెట్లు, డెంటల్ కిట్‌లు) విద్యార్థులకు అందిస్తారు. డాక్టర్ దివాకర్ లెదెల్లా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో అసాధారణమైన విద్యార్థులను గుర్తించారు. మొదటి 5 మంది విద్యార్థులకు రూ.1000, మొదటి 5 విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సంవత్సరానికి రూ.3000, దీంతో పాటు పాఠశాలకు ల్యాప్ టాప్ ను అందజేస్తున్నారు. కాబట్టి ఈ రెండు కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని డాక్టర్ విజయచందర్ రెడ్డి కోరారు. వీరి వెంట ఒమేగా బన్ను క్యాన్సర్ హాస్పిటల్ ప్రతినిధి రాజేందర్, గన్ను సతీష్ కుమార్, మాందాటి శ్రీకాంత్, పిడుగు అనిల్, డెంగు నవీన్, కొలనుపాక సుధాకర్, మాందాటి ప్రశాంత్, సుమంత్, శ్రీనివాస్ , తదితరులు ఉన్నారు.

## ఉమ్మడి గురుకులాలలో ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్, టీఆర్‌ఈఐఎస్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నామని వరంగల్ జిల్లా సమన్వయ అధికారి ఆర్.సమ్మయ్య తెలియజేశారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాల్సిన తేదీలు 18-12-2023 నుంచి 20-1-2024 వరకు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023-24లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష తేదీ 11-2-2024 ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. కాబటట్టి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పిల్లలకు గురుకులాలలో సీటు సాధించుట కోసం ఈ ప్రవేశ పరీక్ష కోపసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ గురుకులాల్లో విలువలతో కూడిన విద్యతో పాటు పోషక విలువలు గల భోజనం, బ్రేక్ ఫాస్ట్, స్నాక్స్, ఉచిత పుస్తకాలు, నోటుబుక్స్, మూడు జతల యూనిఫామ్స్ ఇవ్వబడునన్నారు. ఒక సారి 5వతరగతిలో జాయిన్ ఐతే ఇంటర్ వరకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించబడుతుందని తెలిపారు. డేట్ పొడిగించడం ఒక సదావకాశం, త్వరగా అప్లై చేసి గురుకులాలలో సీటు సాధించి తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసుకుంటున్నామన్నారు.

## సమస్యలుంటే తెలపండి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ వాడవాడిలా తిరుగుతూ సమస్యలుంటే వెంటనే పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ లో ఏదైనా సమస్య ఉంటే నాకు ఫోన్ ద్వారా తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట బాలరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావం పెంపోందిస్తాయి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** క్రీడలు గ్రామాల నడుమ స్నేహభావాన్ని పెంపోదిస్తాయని సీనియర్ నాయకుడు దాత రమణబోయిన రాజు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని చిల్కోడు గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో గెలపోందిన బూర్గపాడు, తెల్లబండ తండా టీంలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. గ్రామంలో క్రీడలకు సంబంధించి ఎటువంటి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుండా వెంకన్న, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన అసికే రాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకోగా రెండు లక్షల 50వేల రూపాయల ఎల్ వో సీ మంజూరైంది. ఈ మేరకు సోమవారం నీరుకుళ్ల గ్రామంలో రాజు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎల్ వోసీ అందజేశారు.

## ముత్తూట్ మనీ లిమిటెడ్ బ్రాంచ్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలోని ఆర్ వీఎస్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ముత్తూట్ మనీ లిమిటెడ్ నూతన బ్రాంచ్ ను రీజినల్ మేనేజర్ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో రఘునాథపల్లి కి చెందిన డాక్టర్ రామిని విద్యాసాగర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ముత్తూట్ మనీ లిమిటెడ్ 130ఏళ్ల చరిత్ర కల్గి భారత దేశంలో ఐదు వేల బ్రాంచ్లను నెలకొల్పి, మూడు వేల కోట్ల టర్నోవర్ తో దిగ్విజయంగా నడుస్తున్నాయని తెలిపారు. కొత్తగా రఘునాథపల్లి మండల ప్రజల సౌకర్యం కోసం బ్రాంచ్ ను నెలకొల్పినట్టు ఆయన తెలిపారు. ఈ బ్రాంచ్ లో 1రూపాయి అతి తక్కువ వడ్డీకే బంగారం ఋణం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే 7989006703, 8639447482 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, ఎంపీటీసీ పెర్నె ఉష రవి, వెల్దీ సర్పంచ్ కొయ్యాడ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుగులోత్ కొంరెల్లి, ముత్తూట్ మనీ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, సిబ్బంది యాకస్వామి, అరుణ్, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 33, 32వ డివిజన్ శిరంగి రాజారాం తోట, కరీమాబాద్, శాంతినగర్, పెరకవాడ, సాకరాశి కుంటలో నివసిస్తున్న అత్యధిక జనాభా కలిగి, నిరుపేద కుటుంబాలు నివసిస్తున్న ప్రాంత ప్రజలకు అండర్ రైల్వే గేట్ లో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. వెంటనే నీటి సౌకర్యం, స్త్రీలు బట్టలు మార్చుకుని గదులు నిర్మించాలని కోరారు. మంత్రి కొండా సురేఖ పైఅధికారులకు సూచించి సమస్య తీర్చాలని ఆ వినితిపత్రంలో విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైట్ల శరత్, టీఎల్ఎఫ్ రేణుక , బండి బాచి, రాజమణి, అడబాల స్వరూప్, మహమ్మద్ అంకుష్, మండల పుష్పలత , హరి డయల్ సింగ్, ఠాకూర్ బబ్బుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంక్రాంతి సంబరాలలో నోములు నొముకోవడంలో భాగంగా మంగళవారం బట్టల బట్టల బజార్ లోని ప్రాంగణంలో దాదాపు 70 మంది మూకుమ్మడిగా వివిధ రకాల పండ్లు, 108కిలోల బియ్యంతో, పసుపు, కుంకుమ, వివిధ రకాల వస్తువులను సమకూర్చుకొని 50 మంది ముత్తయిదువలు, వారి వారి భర్తలు, పిల్లలు, కోడళ్ళు, బిడ్డలు కలిసి అంగరంగ వైభవంగా నోముకొని ఒకరికొకరు పసుపు బొట్టు ఇచ్చుకున్నారు. కొత్త బియ్యంతో దేవుడికి నైవేద్యం చేసి, అందరికీ ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో తొనుపునూరి ఇందుమతి, సుధా, విజయ, అల్లాడి సంధ్యారాణి, వెనిశెట్టి పద్మ, వీణ, తదితర మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల నరసయ్య తల్లి ముత్యాల నీలమ్మ (70) గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. అలాగే కొయ్యడ స్వామి తల్లి కొయ్యడ సంతోషమ్మ (65) గత కొన్ని రోజుల క్రితం మృతి చెందగా వారి స్వగృహాలకు మంగళవారం వరంగల్ పార్లమెంట్ కాంటెస్ట్ అభ్యర్థి దొమ్మటి సాంబయ్య వెళ్లి పరామర్శించారు. వారి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు కడారి నాగేశ్వరరావు, రాపోలు రామ్మూర్తి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇబ్రహీం పాష, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిన్న నాగేష్, హర్యానాయక్, వెల్ది గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని మల్లేష్, మాజీ ఎంపీటీసీ కారంపొడి వెంకటనర్స్, ఓరిగంటి మనోహర్, వేణు, కొయ్యడ భిక్షపతి, పెంతల మోహన్ రెడ్డి, గుర్రాల ప్రభాకర్, పసుల జార్జి, కన్నారపు వెంకటస్వామి, బొల్లపల్లి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా సంక్రాంతి శోభ

**వాకిట్లో రంగవల్లులు..**
**వాడవాడలా భోగి మంటలు..**
**ఉత్సాహంగా యువకుల పతంగుల ఎగరవేత..**
**ప్రత్యేక పిండి వంటలు..**

**వరంగల్ వాయిస్, రేగొండ :** సంక్రాంతి పండగ అంటేనే కొత్త క్రాంతులు.. కొత్త అల్లుళ్లు.. ఇంటింటా రంగవల్లులు.. పిండి వంటలతో ఇల్లంతా సందడి సందడిని నింపే సంక్రాంతికి ప్రత్యేకత సంతరించుకుండడంతో ఉమ్మడి రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని గ్రామాలు భోగి సంక్రాంతి నేడు కనుమతో ప్రత్యేక శోభా సంతరించుకుంది. మంగళవారం కనుమను కన్నుల పండువగా జరుపుకున్నారు. బంధుమిత్రులతో గ్రామాల్లో సందడి మొదలైంది. కాగా ప్రజలు ఆదివారం భోగి పండుగను, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసుకున్నారు. ముగ్గులతో వాకిళ్లను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం పుణ్య సాన్నాలు చేసి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. పిల్లలకు భోగి పండ్లు పోసి దీవించారు. భోగభాగ్యాలు ప్రసాదించమంటూ ప్రజలు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

### చిన్నారులకు భోగీ పళ్లు..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం భోగి రోజు తమ





ఇళ్లల్లో చిన్నారులకు సాంప్రదాయ బద్దంగా భోగి పళ్లను పోశారు. ఐదు రకాల పళ్లను కలిపి చిన్నారుల తలపై నుంచి భోగి పండ్లను పోయడం ఆనవాయితీ. ఈ పళ్లు పోయడంతో పిల్లలు ఆయురారోగ్యాలతో ఉంటారని పెద్దలు చెబుతుంటారు. అలాంటి సాంప్రదాయాన్ని ఉమ్మడి రేగొండ మండలంలో పలుకుటుంబాలు కొనసాగించారు.

### కోడవటంచ ఆలయంలో భక్తుల రద్దీ..

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కోడవటంచ ఆలయంలో భక్తులు భోగి సంక్రాంతి కనుమ పండుగలను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉమ్మడి రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయం లో భక్తుల కిక్కిరిసి పోయారు. ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానం నిర్వహించారు. మండలంలో పలు దేవాలయాల్లో భక్తులు పూజలు అభిషేకాలు చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ మాదాటి అనిత కరుణాకర్ రెడ్డి, ఈవో బిల్లా శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ కొమ్మరాజు రవిలు భక్తుల సౌకర్యం కోసం తగు ఏర్పాట్లు చేసి విజయవంతంగా ముగించారు. ఆలయంలో ఎప్పటికప్పుడు సిబ్బంది గోరంట్ల శ్రావణ్, సొన్నాయిల సుధాకర్, ప్రధాన పూజారి బుచ్చమాచార్యులు దగ్గర ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఏజెంట్ల హవా..?




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్న అధికారులకు ఎవరికీ వారికే ఏజెంట్లు ఉన్నట్లు సమాచారం.. రిజిస్ట్రేషన్ ఆఫీసులో భూముల రిజిస్ట్రేషన్ కావడంతోటే అధికారులు ఏజెంట్లను కలువమంటారు. రిజిస్ట్రేషన్ అయిన అనంతరం సంబంధిత బాధితుడు ఏజెంట్లకు కలిసి డబ్బులు ఇచ్చి పోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.. ఇంతకు ముందున్న సబ్ రిజిస్టర్ పనులు చేసేది గానీ, ఎవరి దగ్గర డబ్బులు ఆశించలేదు. ముఖ్యంగా భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే డాక్యుమెంట్ రైటర్ నుంచి రిజిస్ట్రేషన్ అధికారి వరకు పైసల్ వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు సాయంత్రం అయితే సిబ్బందితో సహా రిజిస్ట్రేషన్ అధికారితో కలిసి కుమ్మక్కై వచ్చిన భూమి రిజిస్ట్రేషన్ బాధితుల వద్ద ఇస్తారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

## తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** భూపాలపల్లి నియోజకవర్గంలో కొన్ని నెలల క్రిందట కురిసిన భారీ వర్షాలతో టేకుమట్ల- రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మించిన బ్రిడ్జి పిల్లరు కూలిన విషయం తెలిసిందే. కాగా, అప్పుడు కాలినడకన వెళ్లే వారికోసం, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలుగా తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేశారు. పెద్ద వాహనాలు వెళ్లడానికి వీలు లేకపోవడంతో వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా అంకుషాపురం గ్రామం నుంచి రాఘవరెడ్డిపేటకు వెళ్ళేందుకు చలివాగు నుంచి యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మట్టి రోడ్డును ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ, పీఆర్ అధికారులను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి ఇవ్వాలన్నారు.

## మేడారం రహదారుల పరిశీలన



**వరంగల్ వాయిస్, ములుగు :** చత్తీస్ గఢ్, భద్రాచలం నుంచి మేడారం వచ్చు ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన రహదారి భద్రతా చర్యలపై జిల్లా ఎస్పీ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి చిన్నబోయినపల్లి నుంచి కొండయ్, ఊరట్టం నుంచి కాల్వపెల్లి రహదారి పనులను మంగళవారం పర్యవేక్షించారు. గత వర్షకాలంలో సంభవించిన వరదలకు దొడ్ల కొండయ్ సిమెంట్ వంతెన కొట్టుకు పోగా ప్రస్తుతం మేడారం జాతర సమీపిస్తున్నందున భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయదారులపై, వాటి భద్రతపై జిల్లా ఎస్పీ దృష్టి సారించారు. రహదారి పనులపై ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారులు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అదేశించారు. ఈ రహదారి పర్యవేక్షణ పనులలో ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఏటూరునాగారం ఎస్ ఐలు రాజు, కృష్ణ ప్రసాద్ పాల్గొనగా వాస్తవ పరిస్థితులను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

## అలరించిన ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసి బుర్ర దీప-దేవెందర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేయగా, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బుర్ర దీప-దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలో ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు ఈ ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగిందన్నారు. పోటీలలో ముగ్గులు వేసేందుకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం అభినందనీయం అన్నారు. ముగ్గుల పోటీలో మొదటి బహుమతి మంచోజుల అనూష, రెండో బహుమతి రామగిరి సంధ్య, మూడో బహుమతి మడుగుల అశ్విత వీరితో పాటు 52 కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఈ సంక్రాంతి పండుగ అందరూ సుభిక్షంగా సుఖశాంతులతో జరుపుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ కొద్ది రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలందరికీ అందే విధంగా పెద్ద సేవకులుగా పని చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సక్కపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జుంక జువ కుమారస్వామి, మండల ప్రధానకార్యదర్శి డా.రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు చందుపట్ల రాజిరెడ్డి, పరకాల పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మచ్చ సుమన్, మండల సీనియర్ నాయకులు కోడెపాక ఐలయ్య, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రాల సాంబ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్, తిప్పర్తి తిరుపతి రెడ్డి, బత్తుల రవి, డా.శంకర్, ఆవుల రవీందర్, జుక్క జువ్వ పోశాలు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు పాడి వివేక్ రెడ్డి, ఆవుల సుమన్, ముంజ విజేందర్, బొట్ల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్‌లో ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జై హనుమాన్ పరపతి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ముగ్గుల పోటీ అత్యంత రంగ వైభవంగా జరుగగా కాలనీ మహిళా సోదరులందరూ చాలా ఉత్సాహవంతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా మహిళ నాయకురాలు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం లక్ష్మి, ఫ్యాషన్ డిజైనర్ ఎస్ఎస్ శిల్పలు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కందికొండ సదానందం మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనేది గొప్ప పండుగ గ్రామీణ ప్రాంతంలో చాలా ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. కార్యదర్శి దేవేందర్ చారి మాట్లాడుతూ ఈ సంక్రాంతి తోనే మన కాలనీలో అందరి ఇంటిముందు ఒక పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతిగా మట్టేవాడ శోభా చంద్రమౌళి, రెండో బహుమతిగా విజయ దేవేంద్ర చారి, మూడో బహుమతిగా చీరాల అరుణ మల్లారెడ్డిలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కట్ట గోజుల రాజేశ్వరరావు, ఓదెల సూర్యనారాయణ, చీరాల మల్లారెడ్డి, పోతుల మురళి, ఉప్పుల రాజు, సముద్రాల రాజేష్, మాటూరు ప్రసాద్, దొనికల మహేష్, ముడుదే రాంప్రసాద్,

# బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా అఖిల భారత క్యాంపెయిన్

**రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల పిలుపు**
**జనవరి 19న జిల్లా సదస్సు, 26న ట్రాక్టర్ ర్యాలీ,**
**27 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఇంటింటి ప్రచారం**
**ఫిబ్రవరి 16న సమ్మె**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని సీఐటీయూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రైతు సంఘం ఆలిండియా కమిటీలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా అఖిల భారత క్యాంపెన్ జయప్రదం చేయడం కోసం మంగళవారం రాంనగర్ లోని సుందరయ్య భవన్ లో రైతు, వ్యవసాయ, సీఐటీయూ సంఘాల సంయుక్త సమావేశం సారంపల్లి వాసుదేవ రెడ్డి అధ్యక్షతన జరిగింది. గడిచిన 10 సంవత్సరాల కాలంలో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేరే విధంగా మోడీ పరిపాలన ఉందని సమావేశం అభిప్రాయపడింది. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించి రోజుకు రూ.600 రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని, రైతు ఉద్యమం సందర్భంగా చట్టాలను వెనక్కి తీసుకునే సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రజల హక్కులను కాలరాసిందని, మోడీ దుర్మార్గపు పాలన ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ సంఘాలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్‌లు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు స్థానిక ఎస్ డీఎనల్ సీఈ క్రీడామైదానంలో డిసెంబర్ లో నిర్వహించబడ్డాయి. దీనిలో శాయంపేట మండలం నేరేడుపల్లి విద్యార్థులు అండర్ -14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న సయ్యద్ రేష్మ, ఏడవ తరగతి చదువుతున్న సయ్యద్ అమీర్ అద్భుతమైన ఆటను ప్రదర్శించి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జనవరి 16 నుంచి 18వరకు జరుగు రాష్ట్రస్థాయి 14సంవత్సరాల సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్లం మాధవి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పీఈటి జట్టి రాజేశ్వర్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ అభినందించారు.

## సంక్షేమ ఫలాలతో ఆర్థిక ప్రగతి కనిపించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతిని పెంచేందుకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం ఐడీవోసీలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో విద్య పటిష్ఠతకు కృషి చేస్తున్న పలు సంక్షేమ శాఖల పనితీరును లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ తో కలిసి అధికారులతో సంక్షేమ శాఖల అమలుతీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెనుకబడిన తరగతులు,షెడ్యూల్ కులాలు, మైనారిటీ , గిరిజన సంక్షేమం, గురుకులాలు, ఐటీఐ, కేంద్రీయ విద్యాలయాలలో అమలు పరుస్తున్న విద్యా ప్రగతిని, మౌలిక వసతుల కల్పనను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రగతిని పెంచేందుకు పాఠశాలల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక రూపొందించుకోవాలని అవసరమైన చోట శిక్షకులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు పాఠశాలల్లో, వసతి గృహాలను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమం, డీఆర్డీఓ సన్యాసయ్య, గిరిజన సంక్షేమం డీడీ ఎర్రయ్య, బీసీ సంక్షేమం నరసింహస్వామి, మైనార్టీ సంక్షేమం శ్రీనివాస్, ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ ముఖేష్ కుమార్, గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

## వైభోపేతంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి జాతర



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర అత్యంత వైభోపేతంగా కొనసాగింది. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని లింగగిరి గ్రామంలోని గుట్టపై జరిగిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతరకు వేలాది మంది భక్తులు ఎడ్ల పండ్లు, ట్రాక్టర్లు, టాటా ఏసీలు, బొలెరోలు, ద్విచక్ర వాహనాలపై తరలివచ్చారు. గుట్ట ముందు ఉన్న స్వామివారి గద్దె ముందు ముడుపులు కట్టి కోరిన కోర్కెలు తీర్చాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని 31 గ్రామాల ప్రజలే కాకుండా నెక్కొండ, దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపురం, పర్వతగిరి, నర్సంపేట, సంగెం, తదితర మండలాల్లోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శన చార్యులు, రమణ చార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టి అభిషేక పూజలను నిర్వహించారు. నెక్కొండ సీఐ హత్తిరాం, చెన్నారావుపేట ఎస్సై పస్తం శ్రీనివాస్ లు పోలీస్ సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదారపు భాస్కర్, ఉప సర్పంచ్ బూరుగు రాజశేఖర్, ఎంపీటీసీ పరకాల లక్ష్మీ రాజన్న, మల్లం సాగర్, ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా సంక్రాంతి రంగవల్లులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గలో మంగళవారం మకర సంక్రాంతి పండుగను కనుము పండుగ సందర్భంగా మహిళలు యువతులు వేకువజామునే మేల్కొని ఇంటిముందు కల్లాపు చల్లి వివిధ రకాల ముగ్గులు వేసి అందమైన రంగులతో అలంకరించి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** సంక్రాతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని చెన్నారావుపేట కాలనీలోని ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, సామాజిక సేవకుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి ఆర్థిక సౌజన్యంతో మంగళవారం సంక్రాతి ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ ముగ్గుల పోటీలో గెలిచిన మహిళలకు మొదటి బహుమతి జంగిలి శ్రుతి, రెండవ బహుమతి కేశపాక జ్యోతి, మూడవ బహుమతి కొమ్ముల జ్యోతి, నాలుగో బహుమతి సాధు పావని, పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కంది కృష్ణ చైతన్య రెడ్డి, గ్రామ పెద్దలు, యూత్ సభ్యుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద బర్ల దేవదాస్, కొంకటి రమేష్, వార్డు సభ్యులు జంగిలి సదయ్య, ఫ్రెండ్స్ యువజన సంఘం అధ్యక్షుడు బారేపాక నవీన్, ప్రధాన కార్యదర్శి జంగిలి అజయ్, నర్మెట సాంబయ్య, సాధు నర్సింగరావు, పైసా సారంగం, పందిర్ల రాజేందర్, జంగిలి యాకయ్య, యువజన సంఘం మాజీ అధ్యక్షుడు జంగిలి కిరణ్, మందుల సాగర్, సతీష్, పవన్, గ్రామ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# యువత అన్ని రంగాల్లో రాణించాలి

**కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ బాషమియా**



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** యువత అన్ని రంగాల్లో రాణించాలని కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ భాషమియా అన్నారు. సోమవారం సాయంత్రం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డివిజన్ కబడ్డీ క్రీడా ఉత్సవాలు నిర్వహించిన సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు భాషమీయా మాట్లాడుతూ విద్యార్థి, యువత అన్ని రంగాల్లో ముందుండాలని, కన్న తల్లిదండ్రులకు, గ్రామానికి, ఈ దేశానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా ఎదగాలని ఆయన ఆశించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించడంలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. విద్య తోటే అన్ని అసమానతలు పోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలను గ్రామ అభివృద్ధి కోసం చేపడుతామని, అభివృద్ధి కోసం పెద్దలందరూ సహకరించాలని వారు కోరారు. అనంతరం వీర్ గాథా 3.0 కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కోటి ఎంట్రీల నుంచి 100మందిలో ఎంపికైన కాసాని కీర్తి ప్రసన్నను గ్రామ పెద్దలందరితో కలిసి కలామ్స్ ఫౌండేషన్ వారు సన్మానించారు. అనంతరం కబడ్డీ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెరుమాండ్ల మానస శ్రీధర్ రెడ్డి, అందే వెంకటేశ్వర్లు, వట్టే శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు పులి దేవేందర్, పులి హరీష్, బొబ్బల నర్సారెడ్డి, పెల్లి ప్రభాకర్, బల్గూరి మహేందర్ రెడ్డి, రుద్రు రాజు, సమ్మెట భిక్షపతి, నల్లగొప్పుల రమేష్, అందే వెంకటరాములు, కలామ్స్ ఫౌండేషన్ సభ్యులు ఊడుగుల రాజు, పరికి మధుకర్, గొల్లపల్లి స్వామి, పులి రాజ్ కుమార్, బొమ్మెర సతీష్, సమ్మెట నగేష్, వట్టే భరత్ రెడ్డి, కుక్కల అజయ్, గొల్లపెల్లి అజయ్, గుల్లపెల్లి కిరీట్, గొల్లపల్లి మధు, పప్పు అశోక్, కుక్కల అశోక్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# అంచనాలు పెంచిన గ్లింప్స్

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ నుంచి రాబోతున్న మోస్ట్ ఎక్జయిటింగ్ ప్రాజెక్టుల్లో ఒకటి తంగలాన్ పా రంజిత్ దర్శకత్వంలో అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదల చేసిన తంగలాన్ గ్లింప్స్ వీడియోతోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. ముందుగా ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే కానుకగా విడుదల చేయాలని నిర్ణయించగా.. అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డది. 2024 వేసవిలో తంగలాన్ థియేటర్లలో సందడి చేయబోతుందని ఇటీవలే వార్తలు రాగా.. దీనిపై అధికారిక అప్‌డేట్ అందించారు మేకర్స్. ఏప్రిల్‌లో తంగలాన్‌ను విడుదల చేస్తున్నట్టు ప్రకటించిన మేకర్స్.. తేదీపై మాత్రం సస్పెన్స్ పెట్టారు. ఇటీవలే బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథ అంటూ విక్రమ్ తన సైన్యంతో సమరాన్ని వెళ్తున్న నయా లుక్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేళ్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తంగలాన్ నుంచి విడుదల చేసిన మాళవికా మోహనన్ లుక్.. డీగ్లామరైజ్‌డ్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఇప్పటిదాకా గ్లామరస్ పాత్రలకే పరిమితమైన ఈ భామ తంగలాన్‌లో నయా అవతార్‌ను చూపించబోతున్నట్టు స్టన్నింగ్ లుక్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్ పా రంజిత్.




# మ్యాజిక్ లుక్‌లో సూర్య

## నెట్టింట్ వైరల్‌గా కంగువా పోస్టర్లు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన ఈ మూవీ గ్లింప్స్ వీడియో, కంగువ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఇప్పటికే పొంగళ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రిలీజ్ చేసిన కొత్త లుక్‌లో సూర్య చేతికి టాటూస్ ఉండటం చూడొచ్చు.

ముందుగా ప్రకటించిన ప్రకారం కంగువ సెకండ్ లుక్ విడుదల చేశారు. సెకండ్ లుక్‌లో ఓ వైపు వారియర్‌గా కత్తి పట్టుకుని కనిపిస్తుండగా.. మరోవైపు స్టైలిష్ లుక్‌లో మ్యాజిక్ చేస్తున్నట్టుగా మెస్మరైజ్ చేస్తున్నాడు సూర్య. కంగువలో దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాబీడియోల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. సూర్యకు బ్లాక్ బస్టర్ ఆల్బమ్స్ అందించిన రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ కంగువ చిత్రానికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. గతానికి, ప్రస్తుతకాలానికి మధ్య ఉండే కనెక్షన్‌తో సాగే స్టోరీలైన్ ఆధారంగా కంగువ తెరకెక్కుతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. సూర్య మరోవైపు సుధా కొంగర డైరెక్షన్‌లో సూర్య 43లో కూడా నటిస్తున్నాడని తెలిసిందే. ఇటీవలే సూర్య.. కంగువ కోసం నా చివరి షాట్ పూర్తయింది. కంగువ నాకు చాలా ప్రత్యేకం. మిమ్మల్ని అందరికీ స్క్రీన్‌పై చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నానని ట్వీట్ చేస్గి ÷నైల్ అప్‌డేట్ అందించాడని తెలిసిందే. ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.










# హనుమాన్ అతిపెద్ద విజయం

## సంక్రాంతి సినిమాల సందడి

సంక్రాంతి సీజన్ వస్తుందంటే సినిమాల సందడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. స్టార్ హీరోల దగ్గర నుంచి చిన్న హీరోల వరకూ సినిమాలను రిలీజ్ చేయడానికి అదే సరైన సమయం అని చాలామంది దర్శక నిర్మాతలు నమ్ముతారు. అందుకే ముందుగానే తేదీలనూ ప్రకటిస్తుంటారు. ప్రతిసారిలానే ఈసారీ బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ నెలకొంది. తెలుగులో అగ్ర తారలైన నాగార్జున,వెంకటేశ్,మహేశ్ బాబుతో పాటు చిన్న హీరో సజ్జా తేజ నటించిన సినిమాలు ప్రేక్షకులను అలరించాయి. నాసామి రంగా, సైంధవ్,గుంటూరు కారంతో పాటు, మనుమాన్ చిత్రాలు సంక్రాంతిబరిలో నిలిచాయి.

మొత్తంగా సంక్రాంతి సినిమాలు బాగానే డబ్బు చేసుకున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్ 'గుంటూరు కారం' జనవరి 12న విడుదలైతే, అదే రోజు చిన్న సినిమా 'హనుమాన్' కూడా విడుదలైంది. ఈ సినిమాకి ప్రశాంత్ వర్మ దర్శకుడు, తేజ సజ్జ కథానాయకుడు. తరువాత జనవరి 13న సీనియర్ నటుడు వెంకటేష్ నటించిన 'సైంధవ్' విడుదలయింది, దీనికి శైలేష్ కొలను దర్శకుడు. జనవరి 14న నాగార్జున, అల్లరి నరేష్, రాజ్ తరుణ్ నటించిన 'నా సామిరంగ' విడుదలైంది. విజయ్ బిన్ని మొదటిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇది, ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చారు. సినిమా కూడా సంక్రాంతి పండగలో భాగం, అందుకే చిత్ర పరిశ్రమలో కూడా సంక్రాంతి పండగ సెలవులని వ్యాపారానికి అనుగుణంగా మలుచు కోవడానికి నిర్మాతలు ఈ పండగకి సినిమాలు విడుదల చేస్తారు. మామూలుగా అయితే రెండు సినిమాలు ఒకేరోజు విడుదలవుతాయి, కానీ ఇలాంటి పండగలప్పుడు నాలుగు సినిమాలు విడుదలైనా, ప్రేక్షకులు చూస్తారని నిర్మాతల భరోసా. అందుకే ఇలా నాలుగు సినిమాలు వేటికవే వైవిధ్యంగా వున్నవి ప్రేక్షకులని అలరిస్తాయని అనుకున్నారు. మొదటి రోజు రెండు సినిమాలు విడుదలయ్యాయి. ప్రశాంత్ వర్మ కొంతవరకు గ్రాఫిక్స్ వుపయోగించి తెలుగులో సూపర్ హీరో చిత్రాన్ని ఈ 'హనుమాన్' సినిమాతో ప్రేక్షకులకి పరిచయం చేసాడు. ఇందులో తేజ సజ్జ సూపర్ హీరో గా నటించాడు. ఈ సినిమాకి మొదటి రోజు థియేటర్స్ కొందరు ఇవ్వలేదు, అందుకని ఈ సినిమా ప్రీమియర్ ఆటలు ఎక్కువ వేసుకున్నారు. సంక్రాంతి సినిమాలల్లో ముందు విడుదలైంది ఈ 'హనుమాన్' సినిమానే. అయితే అనూహ్యంగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, అనుకున్నదానికంటే చాలా పెద్ద విజయం సాధించింది 'హనుమాన్' సినిమా. ప్రేక్షకులు ముఖ్యంగా పిల్లలు ఈ సినిమాని చూడటానికి ఎగబడ్డారు అనే చెప్పాలి. ఒక్క తెలుగు రాష్టాల్లోన్రే కాదు, ఈ సినిమా, అటు హిందీ మాట్లాడే ప్రాంతాలలోనూ, అటు విదేశీ మార్కెట్ లోనూ సంచలనాలు సృష్టిస్తోంది. ఐదో రోజు కూడా ఈ సినిమాకి చాలా పెద్ద డిమాండ్ వుంది, అంటే ఈ సినిమా ఎంత విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు. 'హనుమాన్' ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తాడని ఊహించలేదు.





# అమ్మవారిపేట జాతరకు సహకరించాలి

## మంత్రిని కోరిన కమిటీ సభ్యులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** దామెర గుట్టల్లోని అమ్మవరిపేట శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు మంత్రి కొండా సురేఖ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని జాతర ఆర్గనైజర్ దాసి రాందేశ్ కోరారు. ఈ మేరకు జాతర చైర్మన్ కోడూరి భిక్షపతితో ఆధ్వర్యంలో మంగళవారం మంత్రిని కలిసి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన చర్యలను చేపట్టాలని కోరారు. అమ్మవారిని దర్శించుకునే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికిరా బైరి నాగరాజు, బైరి హరినాథ్, ఆవునూరి కుమార స్వామి, కేడల పద్మ, మంతెన సునిత, భజ్జూరి వీరేశం, ఎ.ఆనందం, ఇ.అశోక్, పి.స్వామి, ఎ.నాగరాజు, ఎ.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్యలో ప్రారంభమైన వేడుకలు

## ఏడు రోజుల పాటు క్రతువులు, 22న రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అయోధ్య రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ వేడుకలకు మంగళవారం అంకురార్పన జరిగింది. శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రాయశ్చిత కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సరయూ నది ఒడ్డున దశవిధ స్నానం, విష్ణు పూజ, గోవు సమర్పణ జరిగింది. ఏడు రోజుల పాటు వివిధ క్రతువులు నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. రామ్ లల్లా విగ్రహ ఊరేగింపు బుధవారం అయోధ్యకు చేరుకోనుంది. ఈ సందర్భంగా సరయూ నది జలంతో రామజన్మభూమి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జనవరి 18న గణేష్ అంబికా పూజ, వరుణ పూజ, మాతృక పూజ, బ్రాహ్మణ వరం, వాస్తు పూజలతో అధికారిక ఆచారాలు ప్రారంభం కానున్నాయి. 19న ఉదయం ఔషధాధివాసం, కేశరాదివస్, ఘృతాధివాసం క్రతువుతో పాటు సాయంత్రం ధ్యాన దివస్ నిర్వహించనున్నారు. 20న రామ జన్మభూమి ఆలయ గర్భగుడిని సరయూ నది జలాలతో శుద్ధి చేయనున్నారు. 21న రామ్ లల్లా విగ్రహానికి 125 కలశాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. కీలక ఘట్టమైన ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు జనవరి 22 మధ్యాహ్నం 12.30గంటలకు ప్రారంభం కానున్నాయి. 21,22 తేదీల్లో భక్తులకు ఆలయంలోని అనుమతి ఉండదు. 23నుంచి సందర్శకులను అనుమతించనున్నారు.

# భక్తులతో పోటెత్తిన కొత్తకొండ

## వీరభద్రుడి సేవలో రాజకీయ ప్రముఖులు

## గుమ్మడికాయలు, కొరమీసాలు సమర్పించిన భక్తులు

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విశేషమైన ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత నవరసాభిషేకం, బిల్వార్చన రుద్ర పారాయణ పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భోగిని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కోర విరీసాలు సమర్పిస్తే కోరిన వరాలు అందిస్తాడని భక్తుల విశ్వాసం. ఉదయం నుంచే భక్తుల తాకిడి అధికమైంది. వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు. స్వామి దర్శనం కోసం భక్తులు రెండు గంటల పాటు వేచి చూశారు. భక్తులకు ఆలయ పాలక మండలి అన్ని వసతులు సమకూర్చింది. కోరిన కోర్కెలు తీర్చే వీరన్నకు భక్తులు కోరవిరీసాలు సమర్పించుకోగా, స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన గుమ్మడికాయలతో మహిళలు స్వామివారికి సమర్పించారు. ఆలయంలో ఏటా ఆనవాయితీగా వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన దామెరుప్పుల వంశీయులు వీరబోనం సమర్పించారు. ఉల్లిగడ్డదామెర, కడిపికొండ నుంచి హాజరైన వీరు స్వామి వారికి నైవేద్యం సమర్పించే ఆనవాయితీగా వస్తుంది. శివసత్తుల పూనకంతోపాటు వీరశైవులు వీరఖడ్గం చేతబూని నృత్యం చేస్తూ డప్పుచప్పుళ్ల మధ్య వీర బోనాన్ని ఆలయం చుట్టూ ప్రదర్శించి వీరభద్రునికి సమర్పించారు. ఈ తంతు సుమారు రెండు గంటలపాటు సాగింది. ర్యాలీలో భాగంగా ఎడ్లబండ్లు ఆలయం



చుట్టూ తిరిగాయి. వీరబోనం వెంట వేలాది భక్తులు పాల్గొన్నారు.

### ప్రముఖుల పూజలు..

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, స్టేషన్ ఘన్ పూర్ శాసన సభ్యుడు కడియం శ్రీహరి, స్థానిక సంస్థల సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు ఒడితల సతీష్ కుమార్, బీజేపీ నాయకులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, జన్నపురెడ్డి సురేందర్, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు వోడితెల ప్రణవ్ తదితరులు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించి మొక్కులు సమర్పించారు. మకర సంక్రాంతి పండుగ కావడంతో భక్తులు కొత్తకొండకు పోటెత్తారు. క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా మండలంలోని కొత్తపల్లి గ్రామం నుండి 75 రథాలు కొత్తకొండకు చేరుకున్నాయి. వీరన్న బ్రహ్మోత్సవాల్లో కొత్తపల్లి గ్రామ రథాలు ప్రధాన ఆకర్షణగా నిలిచినాయి. ఎడ్ల బండ్ల రథాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కాగా వేలేరు కు చెందిన యాదవ కులస్తులు మేకల బండ్ల తో ఆలయం చుట్టూ తిరిగి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు స్వగ్రామమైన వంగర గ్రామంలో వీరభద్రస్వామి రథయాత్రను పీవీ మదన్ మోహన్ ప్రారంభించారు.





# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

## అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌లకు ఛాన్స్

## నామినేషన్లకు సిద్ధం కావాలన్న అధిష్టానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. అద్దంకి దయాకర్, బల్మూరు వెంకట్ పేర్లను ఖరారు చేస్తూ వారికి సమాచారం ఇచ్చింది. వీటితో పాటు గవర్నర్ కోటాలో కూడా ఇద్దరి పేర్లను కరారు చేసినట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీ భర్తీ చేయాల్సిన నాలుగు ఎమ్మెల్సీ సీట్లకు అభ్యర్థుల్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటాలో అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లను ఖరారు చేయగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరామ్, అవిరీర్ అలీ ఖాన్ పేర్లను కాంగ్రెస్ ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది. గురువారమే నామినేషన్లకు చివరి తేదీ ఉంది. ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి గడువు ముగుస్తుంది. అనేక రకాల ఈక్వేషన్లు, అనేక రకాల వ్యక్తులను పరిగణలోకి తీసుకున్న తర్వాత అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ రెండు స్థానాలు పోటీ లేకుండా కాంగ్రెస్ ఖాతాలోనే పడే అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా గవర్నర్ కోటాకు సంబంధించి కోదండరామ్, జావెద్ అలీ ఖాన్ కొడుకు అవిరీర్ అలీ ఖాన్ పేర్లను ఖరారు చేశారు. సియాసత్ పత్రిక సంపాదకుడు జాహెద్ అలీ ఖాన్ కుమారుడు అవిరీర్ అలీ ఖాన్. జాహెద్ అలీ ఖాన్‌కే చాన్స్ ఇవ్వాలనుకున్నా ఆయన రాజకీయ పదవులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ నలుగురి ఎంపిక చేశారు. అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తమ ఎమ్మెల్యే సీట్లను త్యాగం చేశారు. అసెంబ్లీ కోఆర్డినేటర్ గా ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో బల్మూరి వెంకట్ హుజూరాబాద్ ఉప ఎన్నిక నుంచి పోటీ చేశారు. తక్కువ ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పోటీ నుంచి తప్పుకోవాలని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ ఇద్దరూ పోటీ నుంచి తప్పుకున్నారు. బల్మూరి వెంకట్ విద్యార్థి ఉద్యమం నుంచి ఉన్నారు. అనేక ఉద్యమాలు చేశారు. ఎన్ ఎస్ యూఐ తరపున అనేక విద్యార్థి ఉద్యమాలు నడిపించారు. టీఎస్ పీఎస్ సీలో పేపర్ లీక్, ఇతర అక్రమాలకు సంబంధించి గట్టిగా పోరాటం చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. పార్టీ కోసం కష్టపడి పని చేశారు, జైలుకి కూడా వెళ్లారు. ఇక, అద్దంకి దయాకర్ పార్టీ వాయిస్ ను అనేక వేదికలపై బలంగా వినిపించారు. కోదండరామ్‌కు కాంగ్రెస్ హైకమాండ్ ముందుగానే హామీ ఇచ్చింది. ఆ ప్రకారం ఇప్పుడు ఆయనను ఎమ్మెల్సీ చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి కూడా ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు రేవంత్ రెడ్డి మొత్తం జాబితాపై కసరత్తు చేసి వెళ్లారు. ఈనెల 29న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. సంఖ్యాబలం పరంగా చూస్తే కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్సీ, బీఆర్ఎస్‌కు ఇంకో ఎమ్మెల్సీ వస్తుంది. కానీ, ఎన్నికలసంఘం ఈ రెండు స్థానాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లు, వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకే రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కనున్నాయి. ఒక అభ్యర్థికి కనీసం 59.5 ఓట్లు లభిస్తే ఆ అభ్యర్థిదే గెలుపు. అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 64 మంది సభ్యుల బలం ఉంది. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం 2 స్థానాలకు వేర్వేరుగా 119 మంది సభ్యులు రెండు సార్లు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అంటే మెజారిటీ ఉన్న కాంగ్రెస్ సభ్యులు రెండుసార్లు ఓటేస్తారు. అలా రెండు స్థానాలూ కాంగ్రెస్‌కే దక్కుతాయి. బీఆర్ఎస్ పోటీ పెట్టే అవకాశం లేదు. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఎమ్మెల్సీలుగా వీరిద్దరికీ 30 నవంబర్ 2027 వరకు గడువు ఉన్నా.. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడంతో ఇద్దరూ గత నెల 9న తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com